నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 30 ఆగస్టు 2024 | KHAMMAM

- పెసరకు ఎంఎస్‌పీ ఇవ్వాలంటున్న రైతులు
- అయినా మారు మాట్లాడని ప్రభుత్వాలు
- జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లేక కర్షకుల దగా
- ప్రైవేట్ మార్కెట్లో ఖరీదుదారుల సిండికేట్
- ఒక్కరోజు వ్యవధిలోనే భారీగా ధర తగ్గింపు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 29 : ఆరుగాలం కష్టించి, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి, ఇంటిల్లిపాదీ చెమటోడ్చి పంటలు పండించిన అన్నదాతలు ధరల విషయంలో దారుణంగా దగా పడుతున్నారు. 'సొమ్మొకరిది.. సోకొకరిది..' అనే నానుడి చందంగా వారి కష్టం వేరొకరికి ఫలాలను అందిస్తోంది. దీంతో తమ పంటలకు మద్దతు ధర కావాలంటూ అన్నదాతలు నెత్తీనోరూ బాదుకున్నా.. ప్రభుత్వం మారు మాట్లాడిన పాపానపోవడం లేదు. దీంతో 'మద్దతు ధర మిథ్యే..' అన్నది తథ్యంగా కన్పిస్తోంది. పెసలకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక కర్షకులు దగా పడుతుంటే.. ప్రైవేటు మార్కెట్లో ఖరీదుదారులు సిండికేట్ అయి దర్జాగా ధనార్జన చేస్తున్నారు. 'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా..' అనే సామెతను గుర్తు చేస్తూ.. తాము తలుచుకుంటే ధరను ఎంతైనా పడగొట్టగలమని రుజువు చేస్తున్నారు. తాజాగా ఒక్కరోజు వ్యవధిలోనే భారీగా పతనమైన పెసర ధరే ఇందుకు నిదర్శనంగా కన్పిస్తోంది.


ఖమ్మం మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన పెసలు

# మద్దతు ధర మిథ్య!

| | | |
|---|---|---|
| ఖమ్మం జిల్లాలో పెసర సాగు విస్తీర్ణం | : | 14,500 ఎకరాలు |
| దిగుబడి అంచనా | : | 40 వేల క్వింటాళ్లు |
| పెసర మద్దతు ధర (క్వింటాకు) | : | రూ.8,682 |
| ప్రైవేట్ మార్కెట్ ధర (క్వింటాకు) | : | రూ.6,830 |
| రైతులు కోల్పోయే ధర వ్యత్యాసం | : | రూ.1,852 |

### ఒక్కరోజు దెబ్బ.. ఆరుగాలపు కష్టం వృథా..

అన్నదాతల ఆరుగాలపు శ్రమ ఒక్కరోజులోనే వృథా అవుతోంది. రైతులకు మంచి మద్దతు ధర కల్పించడమే తమ ధ్యేయమంటూ చెప్పుకొని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత పాలకులు తీరా పంటల సమయం వచ్చేసరికి ముఖం చాటేస్తున్నారు. మద్దతు ధర మాటలను కాగితాలపై చూపిస్తున్నారు తప్ప ఆచరణలో అన్నదాతలకు ఆవగింజంత ఆర్జననూ అందించడం లేదు. ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఒక్క ఎండు మిర్చికి తప్ప.. వరి, పత్తి, అపరాలు, ఇతర సుగంధ ద్రవ్యాల పంటలకు మద్దతు ధర ఉంది. కానీ.. ఆ మద్దతు ధర అన్నదాతకు అందడం లేదు.

### దిగుబడి పెరగ్గానే ధరను దించేశారు..

అన్నదాతలు ఈ వానకాలం సీజన్‌లో సాగు చేసిన పంటల్లో పెసర ఒకటి. అంచనాలను దాటి ఈ ఏడాది సుమారు 14 వేల ఎకరాల్లో సాగైంది. సాధారణంగా ఏటా పెసర పంట చేతికొచ్చే సమయంలో వాన ముసుర్లు వస్తుంటాయి. దీంతో చేతికొచ్చిన పంట రాలిపోతుంటుంది. కానీ.. ఈ ఏడాది ఇప్పటి వరకూ పొడి వాతావరణం ఉండడంతో నాణ్యమైన పంట చేతికొచ్చింది. దిగుబడి పెరిగింది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అవేమీ చేయలేదు. దీంతో ప్రైవేట్ మార్కెట్లో ఖరీదుదారులు చెప్పిన ధరకే రైతులు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ప్రైవేట్ మార్కెట్లో నిలువు దోపిడీ..

గడిచిన వారం రోజులుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు కొత్త పెసర పంట వస్తోంది. జిల్లా రైతులతోపాటు పొరుగు జిల్లాల రైతులు ఇక్కడికే తమ పంటను తెస్తుంటారు. కొద్ది రోజుల క్రితం కేరళ, తమిళనాడుల్లో భారీ వర్షాలకు అక్కడి అపరాల పంటలు తుడిచిపెట్టుకపోయాయి. దీంతో అక్కడి వ్యాపారులు నారాయణపేట, తాండూర్ ప్రాంతాలకు వచ్చి భారీగా కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఖమ్మం మార్కెట్లోనూ ప్రైవేట్ ధర పెరగాల్సి ఉంది. కానీ.. అందుకు భిన్నంగా ఇక్కడి వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. పంట సన్నగా ఉందని, పచ్చదనం లేదని సాకులు చెబుతూ క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకూ ధరను తగ్గిస్తూ కొనుగోలు చేస్తున్నారు. బుధవారం అపరాలకు ఖమ్మం ఏఎంసీలో క్వింటాకు రూ.7,100 వెచ్చించిన ఖరీదుదారులు.. గురువారం ఉదయం క్వింటాకు రూ.6,630 మాత్రమే ధర నిర్ణయించడం గమనార్హం.



### మద్దతు ధర ఉంటే రూ.40 వేలు కోల్పోయేవాడిని కాదు..



ఈరోజు ఖమ్మం మార్కెట్‌లోని అపరాల యార్డుకు నాతోపాటు చాలా మంది రైతులు పెసర పంటను తెచ్చారు. ఖరీదుదారులు అందరి పంటలనూ పరిశీలించారు. చివరికి నా పంట నెంబర్ వన్‌గా ఉందని తేల్చారు. జెండాపాట నిర్వహించినప్పటికీ నా పంటకు మాత్రం క్వింటాకు రూ.6,830 ధర పెట్టారు. నేను 20 క్వింటాళ్ల పంటను తెచ్చాను. అయితే, ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధర రూ.8,682 ప్రకారం కొనుగోలు చేసి ఉంటే నేను మరో రూ.40 వేల ఆదాయాన్ని పొందేవాడిని. ప్రైవేటులో క్వింటాకు సుమారు రూ.2 వేలు తగ్గించి కొనుగోలు చేయడం వల్ల నేను ఆ రూ.40 వేల ఆదాయాన్ని కోల్పోయాను.

**–జంగాల రమేశ్, రైతు, పాతర్లపాడు, చింతకాని**

### ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం..



పెసర కొనుగోళ్లకు ఒకటి రెండు రోజుల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలంటూ ప్రభుత్వం నుంచి బుధవారమే ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌కు పంట భారీగా వస్తోంది. జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో ఈ రెండు రోజుల్లోనే ఖమ్మం ఏఎంసీలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. డీసీఎంఎస్ ద్వారా పంటను కొనుగోలు చేస్తాం.

**–సునీత, మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా మేనేజర్**

## 'ఈనామ్'కు ఎగనామం

- నిబంధనలకు విరుద్ధంగా పెసల కొనుగోళ్లలో జెండాపాట
- ఖమ్మం ఏఎంసీలో విచిత్రం.. సీక్రెట్ బిడ్డింగ్‌కు తిలోదకం..
- 'ఈనామ్ ఈనామే.. జెండాపాట జెండాపాటే..' అనేలా వ్యవహారం


నిబంధనలకు విరుద్ధంగా జెండాపాట నిర్వహిస్తున్న ఖరీదుదారులు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 29 : 'ఈనామ్ ఈనామే.. జెండాపాట జెండాపాటే..' అనేలా ఉంది ఖమ్మం ఏఎంసీలో ఖరీదుదారుల తీరు. మిర్చి మినహా పత్తి, అపరాల విక్రయాల్లో ఈనామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం) అమల్లో ఉన్నప్పటికీ ఖరీదుదారులు దానికి ఎగనామం పెడుతున్నారు. సాక్షాత్తూ ఏఎంసీ సిబ్బంది ఎదుటే జెండాపాట నిర్వహిస్తున్నారు. 'అక్కడ జెండా లేదుగా? అది జెండా పాట ఎలా అవుతుంది?' అంటూ సాంకేతిక కారణం చెబుతున్నారు గానీ అక్కడ జరిగేది మాత్రం జెండా పాటే. దీంతో ఈనామ్ విధానానికి, సీక్రెట్ బిడ్డింగ్‌కు అర్థం ఏముందున్న ప్రశ్న రైతుల్లో వ్యక్తమవుతోంది.

### రైతులకు మంచి ధర కల్పించేందుకే "ఈనామ్"

వ్యాపారుల్లో పోటీతత్వాన్ని పెంచాలని, తద్వారా రైతులకు మంచి ధర కల్పించాలని గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. దీనికోసం అప్పటి వరకూ ఉన్న జెండాపాట (వ్యాపారులు సిండికేట్ అయి పంటల ధరలను నియంత్రిస్తున్నందున) విధానాన్ని పక్కనబెట్టాయి. దాని స్థానంలో ఏడెనిమిదేళ్ల క్రితం ఈనామ్ విధానాన్ని తీసుకొచ్చాయి. దీని ప్రయోజనాల గురించి ఇటు రైతులకు, అటు వ్యాపారులకు అవగాహన కల్పించాయి. వారిని ఒప్పించాయి. అప్పటి నుంచి ఈనామ్ విధానాన్ని అమలుచేస్తున్నాయి.

### రైతులకు ముందుగానే గుర్తింపు సంఖ్యలిచ్చి..

ఈనామ్ అమలు కోసం అధికారులు వివిధ నిబంధనలను అమల్లోకి తెచ్చారు. ఇందులో భాగంగా పంటలను మార్కెట్‌కు తెచ్చిన రైతులకు ముందుగానే గేట్ వద్ద ఏఎంసీ సిబ్బంది ఎంట్రీలు నమోదుచేస్తారు. వారికి ఒక ఐడీ (గుర్తింపు సంఖ్య)ను ఇస్తారు. రైతు పంటను, దాని నాణ్యతను మార్కెట్ యార్డులో పరిశీలించుకున్న ఖరీదుదారుడు.. సదరు రైతు ఐడీని తీసుకుంటాడు. ఆ పంటకు తాను ఎంత ధర పెట్టగలడో అనే విషయాన్ని నిర్ణయించుకుంటాడు. అక్కడి కంప్యూటర్ రూములోకి వెళ్లి ఆ ఐడీకి ఆన్‌లైన్లో బిడ్డింగ్ వేస్తాడు. ఆ పంటకు వెచ్చించగలిగే ధరను ఆ బిడ్డింగ్‌లో పొందుపరుస్తాడు. ఇదంతా సీక్రెట్ విధానంలో జరుగుతుంది కాబట్టి పంటలను దక్కించుకోవాలనుకునే ఖరీదుదారులు తన సహచర ఖరీదుదారుల కంటే ఎక్కువ ధరకు బిడ్డింగ్ వేస్తారు. దీని ద్వారా రైతుకు లాభం చేకూరుతుంది. అయితే, ఇన్నాళ్లు ఇదే విధానంలో కొనసాగిన ఈనామ్ ప్రక్రియకు కొంతకాలంగా ఖరీదుదారులు తిలోదకాలిచ్చారు. బయట బహిరంగంగానే మార్కెట్ సిబ్బంది ఎదుట జెండాపాట నిర్వహించి, పంట ధరను అందరికీ వెల్లడించి.. ఆ తరువాత వెళ్లి ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో అదే ధరను నమోదు చేస్తున్నారు. కానీ తాము ఈనామ్‌ను పాటిస్తున్నట్లుగా అధికారుల ఎదుట వ్యవహరిస్తున్నారు. దీంతో ఈనామ్ విధానానికి ఎగనామం పెట్టినట్లవుతోంది. ఖరీదుదారులు ముందుగానే సిండికేట్ అయి ధరలను నియంత్రించడంతో రైతులు మళ్లీ నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కాగా, గురువారం అపరాల యార్డుకు 94 మంది రైతులు 1,544 బస్తాల పెసలను తెచ్చారు. ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ వేసిన తరువాత కానీ గరిష్ట ధర తెలియాల్సి ఉంటుంది. కానీ సాక్షాత్తూ సిబ్బంది ఎదుటే జెండాపాట పెట్టారు.

### అపరాల్లో జెండాపాట నిబంధనలకు విరుద్ధం..



ప్రస్తుతం ఖమ్మం మార్కెట్లో మిర్చికి మినహా మిగిలిన అన్ని పంటల క్రయవిక్రయాలూ ఈనామ్ ద్వారానే జరుగుతున్నాయి. పత్తి, అపరాల కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు పదేళ్లుగా బిడ్డింగ్ ద్వారానే జరుగుతోంది. ఇటీవల యార్డులో కొందరు ఖరీదుదారులు జెండాపాట పెట్టడం నిబంధనలకు విరుద్ధం. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

**–ప్రవీణ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ**

## సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

### ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఆగస్టు 29 : రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రజావాణి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రోజువారీ లక్ష్యం మేరకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ధరణి కింద టీఎం-33 మాడ్యూల్ దరఖాస్తులు 3,391, ఇతర మాడ్యూల్ కింద 5,513 దరఖాస్తులు వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటి పరిష్కారం విషయంలో తహసీల్దార్లు నియమ నిబంధనలు తప్పక పాటించాలని, ఏ దశలోనూ పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి సత్ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా చూడాలన్నారు. కోర్టు, ట్రిబ్యునల్ల డైరెక్షన్లకు వెంటనే హాజరుకావాలన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాల స్వాధీనానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. సమస్యలున్న ప్రభుత్వ స్థలాల విషయంలో నెలకొక బిట్ చొప్పున లక్ష్యం పెట్టుకొని సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రులకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

### స్తంభాద్రి గణేశ్ ఉత్సవ కమిటీ, పీస్ కమిటీల సమన్వయ సమావేశం

ఖమ్మం, ఆగస్టు 29 : గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తమండళ్లు ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై సీపీ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, డీజేలు పెట్టేందుకు అనుమతి లేదన్నారు. గణేశ్ మండపంలో 24 గంటలపాటు వలంటీర్లు ఉండేలా చూడాలని, భక్తుల సందర్శనను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే భద్రతకు సంబంధించి పోలీసు, నగర పాలక సంస్థ, అగ్నిమాపక శాఖ, నీటిపారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ.. నవరాత్రి ఉత్సవాలను సజావుగా జరుపుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సునీల్‌దత్


పాల్గొన్న గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులు

### నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

వినాయక నిమజ్జనోత్సవానికి జిల్లా పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ వెల్లడించారు. సెప్టెంబర్ 16న జరిగే గణేశ్ నిమజ్జనం కోసం భారీ పోలీసు బందోబస్తుతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లు, క్రేన్లు, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు కొన్ని సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సీపీ వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సాంబరాజు, సీఐలు ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, రమేశ్, భానుప్రకాశ్, మోహన్‌బాబు, సతీశ్, కమిటీ సభ్యులు వినోద్ లాహోటి, జైపాల్‌రెడ్డి, సుధాకర్, రామారావు, విద్యాసాగర్, పీస్ కమిటీ సభ్యులు హఫీజ్, జావిద్, అజీజ్, ఆసిఫ్, ఖాసీం, తౌఫిజ్ అహ్మద్, జామల్‌పాషా పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలుచేయాలి

### భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా


భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 29 : ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా సంఘం ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా మోహన్, బట్టు చందు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేసి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించారని, తక్షణమే వాటిని అమలు చేయాలని, లేదంటే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదగిరి, పాషా, సురేశ్, కిషన్, సిద్దయ్య, కిరణ్మయి, అర్జున్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి

### వీసీలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి పంచాయతీ ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్తగూడెం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వార్డులవారీగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ ఫొటోతో కూడిన ఓటరు జాబితా రూపొందించాలన్నారు. వార్డులవారీగా అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను, సిబ్బందిని గుర్తించి వారి వివరాలు అందజేయాలన్నారు. ప్రతి జిల్లా నుంచి 10 మంది రిసోర్స్ పర్సన్‌ను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి శిక్షణకు పంపించాలన్నారు. వీసీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, జడ్పీ సీఈవో చంద్రశేఖర్‌రావు, డీపీవో చంద్రమౌళి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీఎల్‌పీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

## డాక్టర్, హెచ్‌ఈవోపై చర్యలు తీసుకోవాలి

### భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట బూర్గంపహాడ్ మండల ఆశా కార్యకర్తల ధర్నా



భదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 29 : తరచూ తమను వేధిస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు, హెచ్‌ఈవోపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, సీఐటీయూ శ్రామిక మహిళా కన్వీనర్ పద్మ మాట్లాడారు. ఆశా వర్కర్లను వేధిస్తే సహించేది లేదని, మోరంపల్లి బంజర పీహెచ్‌సీలో ఆశా వర్కర్లను వేధిస్తున్న వైద్యుడు, హెచ్‌ఈవోలపై వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లతో పరిమితికి మించి పనులు చేయిస్తున్నారని, వారిని విధుల తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవోకు అందజేశారు.

### ధర్నాలో స్పృహతప్పి పడిపోయిన ఆశా వర్కర్

కాగా.. ధర్నా సందర్భంగా సారపాకకు చెందిన శ్రీలత అనే ఆశా వర్కర్ స్పృహతప్పి పడిపోయింది. వెంటనే ఆమెకు వైద్య సేవలు అందించడంతో కోలుకుంది. కాగా.. ధర్నాపై స్పందించిన వైద్య శాఖ అధికారులు.. వేధింపుల ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.రమేశ్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు బుచ్చమ్మ, తారామణి, కృష్ణవేణి, వసంత తదితరులు పాల్గొన్నారు.


స్పృహతప్పి పడిపోయిన ఆశా వర్కర్

## నష్టమొస్తే నర్సరీ యజమానులదే బాధ్యత

### బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

### జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్

కూసుమంచి, ఆగస్టు 29 : నర్సరీల్లో విక్రయించిన మిర్చి నారుతో రైతులకు నష్టం వాటిల్లితే దీనికి పూర్తి బాధ్యత నర్సరీ యజమానులదేనని, నిబంధనలు నామమాత్రంగా పాటిస్తే వారిపై చర్యలు తప్పవని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి మధుసూదన్ హెచ్చరించారు. గట్టుసింగారంలోని రైతు వేదికలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సరీలను ఏర్పాటు చేసుకునే యజమానులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో నర్సరీల నుంచి కొనుగోలు చేసిన మొక్కలు నాణ్యతగా లేవని, మొక్కలు ఏపుగా పెరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇలాంటి కేసులు వస్తే వాటికి పూర్తి బాధ్యత నర్సరీల యజమానులే వహించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే నర్సరీలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూసుమంచి ఏడీ సరిత, ఉద్యానవన అధికారి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.